ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

అడిషనల్‌ కలెక్టర్‌ చంద్రశేఖర్‌



శిబిరంను ప్రారంభిస్తున్న అడిషనల్‌ కలెక్టర్‌ చంద్రశేఖర్‌

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌ చంద్రశేఖర్‌ అన్నారు. శనివారం తెల్లాపూర్‌ మున్సిపల్‌ కార్యాలయ ప్రాంగణంలో ఏఐజీ ఆసుపత్రి, తెల్లాపూర్‌ మున్సిపల్‌, తెల్లాపూర్‌ నైబర్‌ హుడ్‌, యుసీ బ్రెస్ట్‌ ఫౌండేషన్‌ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రొమ్ము క్యాన్సర్‌ స్కానింగ్‌, అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం నిత్యం గంట సమయాన్ని కేటాయించాలని కోరారు. వాకింగ్‌, యోగా చేయడం వలన రోజంతా చురుగ్గా ఉంటామన్నారు. అనంతరం శిబిరంలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ రాములు గౌడ్‌, మున్సిపల్‌ కమిషనర్‌ సంగారెడ్డి, తెల్లాపూర్‌ నైబర్‌ హుడ్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు రమణ, నిర్వాహకులు అమితకుమార్‌ చౌదరి, అశోక్‌, త్యాగరాజన్‌, వైద్యులు డాక్టర్‌.శ్రీనివాస్‌మూర్తి, డాక్టర్‌.అమూల్య పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

ఆల్విన్‌కాలనీ: రైతు బజార్‌ సమీపంలోని పరికి చెరువు మత్తడి సమీపంలో సర్వే నంబర్‌ 336లోని అక్రమ నిర్మాణాన్ని శనివారం అధికారులు కూల్చివేశారు. తహసీల్దార్‌ స్వామి ఆదేశాల మేరకు ఆర్‌ఐ అగస్త్యన్‌ సిబ్బందితో కలిసి కూల్చివేత చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పటాన్‌చెరు సీఐ వినాయక్‌రెడ్డి

పటాన్‌చెరు: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్‌లను పక్కనపెట్టి చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలని పటాన్‌చెరు సీఐ వినాయక్‌ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామంలో హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్‌ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహించిన క్యాంపు ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీ విద్యార్థులు గ్రామంలో వారం రోజులుగా చేపట్టిన సేవా కార్యక్రమాలను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలను ఇంకా కొనసాగించాలని సూచించారు.అనంతరం లక్డారం గ్రామానికి చెందిన ఐదుగురు విద్యార్థులు కిక్‌ బాక్సింగ్‌ పోటీలలో గోల్డ్‌, సిల్వర్‌ మెడల్స్‌ సాధించిన సందర్భంలో వారిని, కోచ్‌లను ఎన్‌ఎస్‌ఎస్‌ తరఫున సన్మానించి అభినందనలు తెలిపారు.

'హోలిస్టిక్‌'లో ఏఐ-ఐవీయూఎస్‌ సిస్టమ్‌

- గుండె రక్తనాళాల్లో ఎలాంటి బ్లాక్‌లు ఉన్నాయో గుర్తిస్తుంది
- స్టంట్‌ వేసే సమయం తగ్గుతుంది : ఆస్పత్రి సీఈఓ డాక్టర్‌ హనుమాన్‌ప్రసాద్‌



గచ్చిబౌలి: రక్త నాళాల్లో ఎలాంటి బ్లాక్‌లు ఉన్నాయి, వాటి సైజు, ఏ స్టెంట్‌ వేయాల్సి ఉంటుందనే ఖచ్చితమైన సమాచారాన్ని తెలియజేసే ఏఐ-ఐవీయూఎస్‌ సిస్టమ్‌ అందుబాటులోకి వచ్చిందని హోలిస్ట్‌ హాస్పిటల్స్‌ గ్రూప్‌ సీఈఓ డాక్టర్‌ హనుమాన్‌ప్రసాద్‌ తెలిపారు. తెలుగు రాష్ట్రాలలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. శనివారం మసీద్‌బండలోని హోలిస్టిక్‌ హాస్పిటల్‌లో ఆర్టిఫీషియల్‌ ఇంటెలిజెన్స్‌తో పని చేసే ఐవీయూఎస్‌ పరికరాన్ని ప్రారంభించారు. అనంతరం ఇంటర్‌వెన్షన్‌ కార్డియాలజిస్ట్‌ డాక్టర్‌ శ్రవణ్‌ మాట్లాడుతూ గుండె రక్త నాళాల్లో రక్తం గడ్డ కట్టడం, కాల్షియం, కొలెస్ట్రాల్‌ బ్లాక్‌లను ఐవీయూఎస్‌ మిషన్‌లోని కెమెరా ద్వారా గుర్తిస్తామన్నారు. ఈ విధానంలో స్టంట్‌ వేసిన వారికి లైఫ్‌ స్పాన్‌ ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఐవీయూఎస్‌ మిషన్‌ ద్వారా స్టంట్‌లు వేస్తే మళ్లీ సమస్య రాదన్నారు. భీమవరానికి చెందిన జి.రామారావుకు ఐవీయూఎస్‌ పరికరం ద్వారా బ్లాక్‌లను గుర్తించి మూడు స్టంట్‌లు వేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ సుబ్బారావు, డాక్టర్‌ శివ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

స్వెట్టర్లు పంపిణీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లిలోని బాల వికాస్‌ ఎడ్యుకేషనల్‌ సొసైటీ డిజాబుల్డ్‌ స్కూల్‌లో దివ్యాంగులకు కాంగ్రెస్‌ పార్టీ డివిజన్‌ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు శనివారం స్వెట్టర్లను అందజేశారు. 11 రోజుల పాటు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంబీసీ కార్పొరేషన్‌ చైర్మన్‌ జెరిపాటి జైపాల్‌ హాజరై మాట్లాడారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలని కోరారు.

ఆక్రమణల తొలగింపు.. ఫ్రీ లెఫ్ట్‌

ట్రాఫిక్‌ సమస్యను ఇలా తగ్గిస్తున్నాం

- రాంగ్‌రూట్‌లో వస్తే కేసులు...
- అందరూ ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో మియాపూర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రశాంత్‌



చందానగర్‌: ట్రాఫిక్‌ సమస్య పరిష్కారానికి రోడ్లపై ఫుట్‌పాత్‌ ఆక్రమణలు తొలగించడంతోపాటు ఫ్రీ లెఫ్ట్‌లు ఏర్పాటు చేసి సమస్యను కొంతమేర తగ్గిస్తున్నామని మియాపూర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రశాంత్‌ తెలిపారు. మియాపూర్‌ ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్ల విస్తరణ జరగడం లేదు. రాంగ్‌రూట్‌లో వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్‌ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. రోజుకు రాంగ్‌రూట్‌ కేసులు 200 వస్తున్నాయి. నిబంధనల అతిక్రమణలో నెలకు 6వేలకు పైగా కేసులు నమోదు చేస్తున్నామన్నారు. 'సాక్షి' ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : ట్రాఫిక్‌ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు?

జ : మియాపూర్‌ ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ట్రాఫిక్‌ రద్దీ ఉన్న ప్రాంతాలను గుర్తించాం. ప్రణాళికా బద్ధంగా నియంత్రించేందుకు అనేక ప్రాంతాల్లో యూ టర్న్‌ల వద్ద ట్రాఫిక్‌ సిబ్బందిని నియమించి, డివైడర్లు ఏర్పాటు చేశాం. ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను తొలగించి వాహనాలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకున్నాం.

ప్ర : రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల గురించి..

జ : మియాపూర్‌ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న స్పాట్‌లను గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. మెట్రో పిల్లర్‌ 600, మదీనాగూడ మైత్రీకమాన్‌, హఫీజ్‌పేట్‌ ఫ్లైఓవర్‌, జీఎస్‌ఎం మాల్‌, దీప్తిశ్రీనగర్‌ ప్రాంతాలలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రోడ్డు డివైడర్‌ మధ్యలో అడ్డుగా వెల్డింగ్‌ ఫెన్సింగ్‌ లేకపోవడం.. ఆల్విన్‌కాలనీ చౌరస్తా అతిథి హోటల్‌ వద్ద నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్న తీరును గుర్తించి అక్కడ వెల్డింగ్‌ ఫెన్సింగ్‌ నిర్మాణానికి ప్రతిపాదనలను పైఅధికారులకు అందజేశాం.

మియాపూర్‌ ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ ఫోన్‌ నంబర్లు
ట్రాఫిక్‌ సీఐ ప్రశాంత్‌ : 9491039172
ఆర్‌ఐ అనిల్‌ : 9490617353
ఎస్‌ఐ నవీన్‌ : 8712568404
ఎస్‌ఐ మక్బుల్‌ పాషా : 9849403279

ప్ర : ట్రాఫిక్‌ ఉల్లంఘనులపై కేసులు పెడుతున్నారా..?

జ : నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. ప్రధానంగా ట్రిపుల్‌ రైడింగ్‌, వ్యతిరేక దిశలో డ్రైవింగ్‌, యూటర్న్‌ వద్ద కాకుండా డివైడర్‌ వద్ద నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు క్రాస్‌ చేయడం, డ్రైవింగ్‌ లైసెన్స్‌ లేకుండా వాహనాలు నడపడం, మైనర్లు వాహనాలు నడపడం వంటి వాటిపై, రిజిస్ట్రేషన్‌ నంబర్లు లేకుండా ఉన్న వాహనదారులపై చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర : ఈ సంవత్సరం మొత్తం డ్రంకెన్‌డ్రైవ్‌ కేసులు ఎన్ని..

జ : మియాపూర్‌ ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో వారాంతాల్లో డ్రంకెన్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నాం. 2024 సంవత్సరంలో 2,000 కేసులు నమోదు చేశాం. మద్యం తాగి వాహనాలు నడపొద్దని వలంటీర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

సిద్ధిఖీనగర్‌లో మరో 10 అక్రమ నిర్మాణాలు సీజ్‌



సిద్ధిఖీనగర్‌లో టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు సీజ్‌ చేసిన భవనాలు



సాక్షి ఎఫెక్ట్‌..

గచ్చిబౌలి: కొండాపూర్‌ డివిజన్‌లో అనుమతులు లేకుండా చేపట్టిన అక్రమ నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ అధికారులు శనివారం సీజ్‌ చేశారు. సిద్ధిఖీనగర్‌లో అక్రమ నిర్మాణాలపై సర్వే చేపట్టిన శేరిలింగంపల్లి సర్కిల్‌ టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు వారం రోజుల క్రితం ఆరు భవనాలు సీజ్‌ చేసిన విషయం తెలిసిందే. సర్వేలో గుర్తించిన కొన్ని భవనాలను మాత్రమే సీజ్‌ చేయడంతో సాక్షిలో 'అన్ని సీజ్‌ చేయరా' శీర్షికతో ప్రచురించిన కథనానికి టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు స్పందించారు. శనివారం శేరిలింగంపల్లి టౌన్‌ప్లానింగ్‌ ఏసీపీ వెంకట రమణ ఆధ్వర్యంలో 10 భవనాలను సీజ్‌ చేశారు. సీజ్‌ చేసిన భవనాలలో మళ్లీ పనులు చేసినా, భవనాలను పొజీషన్‌లోకి తీసుకున్న క్రిమినల్‌ కేసులు నమోదు చేస్తామని ఏసీపీ వెంకటరమణ తెలిపారు. విడతల వారీగా సిద్ధిఖీనగర్‌లో అక్రమ నిర్మాణాల సీజింగ్‌ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

నేర పరిశోధనలో సీసీ కెమెరాలు కీలకం

మియాపూర్‌ ఇన్‌స్పెక్టర్‌ క్రాంతికుమార్‌



జనప్రియనగర్‌లో సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో సీఐ క్రాంతికుమార్‌, జగదీశ్వర్‌గౌడ్‌ తదితరులు

చందానగర్‌: నేర పరిశోధనలో సీసీ కెమెరాలు కీలకపాత్ర వహిస్తాయని, పోలీస్‌శాఖకు ఇది ఆయుధంగా మారిందని మియాపూర్‌ ఇన్‌స్పెక్టర్‌ క్రాంతికుమార్‌ పేర్కొన్నారు. హఫీజ్‌పేట్‌లోని జనప్రియ నగర్‌-2 వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నందు నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సంక్షేమ సంఘం నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మియాపూర్‌ సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ నర్సింహారెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్‌ జగదీశ్వర్‌గౌడ్‌, హఫీజ్‌పేట్‌ కార్పొరేటర్‌ పూజితాగౌడ్‌, టీపీసీసీ రాష్ట్ర లేబర్‌ సెల్‌ వైస్‌ చైర్మన్‌ సంజీవరెడ్డి, నాయకులు యాదగిరిగౌడ్‌, శేఖర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, లక్ష్మయ్య, సుదర్శన్‌, కిష్టయ్య, రాము, నవీన్‌, రవి, యాదగిరి, పరమేష్‌ పాల్గొన్నారు.

గతుకుల రోడ్డు.. అవస్థలు



లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి నుంచి పీజేఆర్‌ స్టేడియంకు వెళ్లే రోడ్డు దుస్థితి

శేరిలింగంపల్లి: ప్రధానరోడ్లు అధ్వానంగా మారాయి. చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి నుంచి పీజేఆర్‌ స్టేడియం మార్గంలో సిటిజన్‌ కాలనీ వద్దకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు 4 నెలలుగా ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా చందానగర్‌ నుంచి గచ్చిబౌలి వైపు వెళ్లే ఉద్యోగులతో ఆ రోడ్డు బిజీగా ఉంటుంది. దీంతో ఆ రోడ్డులో గోతులు ఎక్కడ ఉన్నాయో తెలియక వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ మార్గం రద్దీగా ఉండటంతో



ట్రాఫిక్‌ సమస్య నెలకొంటోంది. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్‌ అధికారులు రోడ్డు నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలి

మూసాపేట: ఉరుకుల, పరుగుల జీవితంలో మానసిక ఉల్లాసం కోసం ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కూకట్‌పల్లిలోని ఎన్‌ఆర్‌సీ గార్డెన్‌లో డీసీపీ బాలానగర్‌ జోన్‌ పరిధిలోని 8 పోలీస్‌ స్టేషన్‌ల సీఐలు ఎస్‌ఐలు, ఏఎస్‌ఐ, ఇతర సిబ్బంది ధ్యానం చేశారు. ఆర్ట్‌ ఆఫ్‌ లివింగ్‌ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 155 మంది పోలీస్‌ సిబ్బంది ధ్యాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పని ఒత్తిడికి లోనవుతున్న సిబ్బందికి ధ్యానం ఔషధంలా పనిచేస్తుందన్నారు.

రోబోటిక్స్‌, కోడింగ్‌పై విద్యార్థులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో రోబోటిక్స్‌తో విద్యార్థులు

రాయదుర్గం: గచ్చిబౌలి టీఎన్‌జీఓకాలనీలోని గోల్డ్‌ క్రెస్ట్‌ పాఠశాల ఆవరణలో రోబోటిక్స్‌, కోడింగ్‌పై ఆధారపడిన ఇంటరాక్టివ్‌ క్లౌడ్‌ ఆధారిత 'కోడ్‌ క్రాఫ్ట్‌' అవగాహనా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పాఠశాలలో 3వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు కొత్త సాఫ్ట్‌వేర్‌ అప్లికేషన్లు, మొబైల్‌ యాప్‌ అభివృద్ధిపై వివరించారు. ఈ కార్యక్రమంలో యూలో టెకీ సంస్థ మేనేజర్‌ పద్మజ, స్కూల్‌ కో ఫౌండర్‌ సునైన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవడం అవసరమన్నారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణతో విద్యార్థులు కొత్తగా ఆలోచించగలుగుతారన్నారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు కిరణ్‌కుమార్‌ బూసాని, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్‌ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న కాలనీ అధ్యక్షులు షేక్‌ ఖాసీం తదితరులు

చందానగర్‌: చందానగర్‌లో కార్పొరేటర్‌ మంజులా రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్‌ వేడుకల్లో పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. కేక్‌ కట్‌ చేశారు. క్రిస్మస్‌ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నరేందర్‌ బల్లా, సందీప్‌రెడ్డి, పాస్టర్లు ఆంటోని ఏలియా, డేనియల్‌, కరుణాకర్‌, మోజెస్‌, సునీల్‌, నటానిల్‌ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

శేరిలింగంపల్లి: గుల్‌మొహర్‌ పార్కు కాలనీలో ప్రీ క్రిస్మస్‌ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్‌ అధ్యక్షులు షేక్‌ ఖాసీం మాట్లాడుతూ శాంతియుత సమాజ నిర్మాణానికి ఏసు క్రీస్తు బోధనలను పాటించాలని అన్నారు. పేదల పట్ల దయ కలిగి ఉండాలన్నారు. అనంతరం కాలనీలో పనిచేస్తున్న కార్మికులు, జీహెచ్‌ఎంసీ శానిటేషన్‌ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్‌ నిరంజన్‌ ప్రసాద్‌, నిర్వాహకులు నాగన్న, రవికుమార్‌, రాజు, కృష్ణ, రాణి విక్టోరియా, కాలనీ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి ఆనంద్‌కుమార్‌, ఉపాధ్యక్షులు మోహన్‌రావు, రఘురామ్‌, ప్రభాకరచారి, సంయుక్త కార్యదర్శులు వెంకటేశ్వర్లు, శేఖర్‌రావు, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ విల్సన్‌ తదితరులు పాల్గొన్నారు.

దవాఖానా తనిఖీ..

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్‌ -1లోని పల్లె దవాఖానాను డివిజన్‌ కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ శనివారం తనిఖీ చేశారు. వైద్య సేవలను పరిశీలించారు. దవాఖానాలో బీపీ, షుగర్‌ మందుల కొరత ఉందని వైద్యులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి మందులు త్వరగా అందుబాటులోకి వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్‌, పోశెట్టిగౌడ్‌, బి. వెంకటేష్‌గౌడ్‌, కుమారచారి, రాంరెడ్డి, రఘు, నరసింహారెడ్డి, హేమలత, రాజేందర్‌, డాక్టర్‌ సాయి కృష్ణ, ఏఎన్‌ఎం శశికళ తదితరులు పాల్గొన్నారు.



బస్తీ దవాఖానాను తనిఖీ చేసిన కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ తదితరులు

నిత్య జీవితంలో గణితం అనివార్యం

గచ్చిబౌలి: నిత్య జీవితంలో గణితం అనివార్యమని సంస్కృతి గ్రూప్‌ ఆఫ్‌ స్కూల్స్‌ చైర్మన్‌ మంగళారపు లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. శనివారం కొండాపూర్‌లోని సంస్కృతి హై స్కూల్‌లో రామానుజం జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. పిల్లలు చాక్లెట్‌ కొనడం నుంచే గణితం ప్రారంభమవుతుందన్నారు.గణిత శాస్త్రానికి సంబంధించిన క్విజ్‌, ప్రదర్శనలలో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంస్కృతి హైస్కూల్‌ డైరెక్టర్‌ భవాని, ప్రిన్సిపాల్స్‌ సుబ్బలక్ష్మీ జయంతి, బాలరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

మాదాపూర్‌ జిల్లా పరిషత్‌ హైస్కూల్‌లో..

మాదాపూర్‌: మాదాపూర్‌లోని జిల్లా పరిషత్‌ హైస్కూల్‌లో శనివారం గణితశాస్త్ర దినోత్సవంలో భాగంగా శ్రీనివాస రామానుజన్‌ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ గణితశాస్త్ర అచార్యులు చిరంజీవి మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్‌ చిన్నవయస్సులోనే ఆయిలర్‌ నియమాలు, త్రికోణమితి సమస్యలను సాధించేవారన్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కన్వీనర్‌ తాడిబోయిన రామస్వామి యాదవ్‌, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం.బసవలింగం, అధ్యాపకులు నరోత్తమరెడ్డి, సత్యనారాయణ, మధుసూదన్‌రెడ్డి, అనిల్‌కుమార్‌, మహేందర్‌ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ గణిత దినోత్సవంలో పాల్గొన్న సంస్కృతి హైస్కూల్‌ విద్యార్థులు



మాట్లాడుతున్న హెచ్‌సీయూ గణితశాస్త్ర ఆచార్యులు చిరంజీవి తదితరులు

హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థికి అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న పరిశోధక విద్యార్థి సునీల్‌కుమార్‌

రాయదుర్గం: హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థి సునీల్‌కుమార్‌కు అంతర్జాతీయ సదస్సులో అత్యుత్తమ పరిశోధనాపత్రం అవార్డు లభించింది. గుర్‌గావ్‌లో జరిగిన అంతర్జాతీయ సస్టేనబుల్‌ బిజినెస్‌ సదస్సులో సునీల్‌కుమార్‌ 'ఆగ్మెంటెడ్‌ రియాలిటీ అండ్‌ సస్టేనబుల్‌ కన్స్యూమర్‌ బిహేవియర్‌' అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. అవార్డుతో బాటు రూ.10వేల నగదు బహుమతిని కూడా అందించారు. హెచ్‌సీయూలో మేనేజ్‌మెంట్‌ స్టడీస్‌లో డాక్టర్‌ శ్రీనివాస్‌కుమార్‌ పర్యవేక్షణలో సునీల్‌కుమార్‌ పీహెచ్‌డీ చేస్తున్నారు. హెచ్‌సీయూ ఫ్యాకల్టీ ప్రతినిధులు, పరిశోధక, పీజీ విద్యార్థులు అభినందించారు.

ఎంబీఏ విద్యార్థినికి లయన్స్‌ క్లబ్‌ ఆర్థికసాయం



చందానగర్‌: చందానగర్‌కు చెందిన ఎంబీఏ విద్యార్థిని తేజస్వినికి లయన్స్‌ క్లబ్‌ జోన్‌ చైర్మన్‌ కొండ విజయ్‌కుమార్‌ శనివారం రూ.20వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షులు బసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ట్రెజరర్‌ రెడ్డి ప్రవీణ్‌రెడ్డి, నూకల సందీప్‌, మారం ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సందర్శించిన విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్‌: విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జిజ్ఞాస పరిశోధనా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు శనివారం గ్రంథాలయాలను సందర్శించారని పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ శ్రీనివాస్‌ తెలిపారు. విద్యార్థులకు పరిశోధనల పట్ల విజ్ఞానాన్ని, ఆసక్తిని పెంపొందించడం కోసం ఏర్పాటు చేసిన జిజ్ఞాస స్టూడెంట్స్‌ స్టడీ ప్రాజెక్ట్‌లో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ గ్రంథాలయం, శ్రీకృష్ణ దేవరాయ భాషా నిలయం, ఎన్‌టీఆర్‌ స్టేడియంలో ఏర్పాటు చేసిన బుక్‌ ఫెయిర్‌, సెంట్రల్‌ లైబ్రరీ, నవ చేతన బుక్‌ హౌస్‌ వంటి ప్రతిష్టాత్మక గ్రంథాలయాలను సందర్శించి సమాచారాన్ని సేకరించారని చెప్పారు. గ్రంథాలయాలు.. సామాజిక ప్రయోజనాలు అనే అంశంపై పరిశోధనా వ్యాసం తయారు చేయనున్నారని తెలిపారు.

ఆలయంలో గోపూజ

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్‌ చెరువు సమీపంలోని గోదారంగనాథస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం గోపూజ నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా జనవరి 10న ఉత్తర ద్వార దర్శనం, 11న కూడారై మహోత్సవం, 13న శ్రీ గోదారంగనాథ స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.



నృత్య పుష్పాంజలి

మాదాపూర్‌: శిల్పారామంలో నిర్వహిస్తున్న చేనేత హస్తకళా మేళాలో భాగంగా శనివారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. రిచ్‌మండ్‌, వర్జీనియా యునైటెడ్‌ స్టేట్స్‌ నుంచి అమేయ కింగ్‌ బృందం అనూష, ఉదిత, వింధ్య, కూచిపూడి నృత్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మోహినియట్టంలో సిద్ధేంద్ర శృతి, హనుమాన్‌ చాలీసా, తిల్లాన, మంగళం తదితర అంశాలను ప్రదర్శించారు. ఒడిస్సీ చొల్కొట్టు, నమ్మి బసంత్‌ పల్లవి, వక్రతుండ, ధనశ్రీ తిల్లాన అంశాలను ప్రదర్శించారు.





అన్నమయ్యపురంలో..

అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా అమెరికాకు చెందిన జయంతి ఘట్రాజు ,నాట్యాలయ స్కూల్‌ ఆఫ్‌ డ్యాన్స్‌ సంస్థ గురువు వినీత సుబ్రహ్మణ్యం, గాయత్రి అయ్యర్‌ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనలతో అలరించారు. పుష్పాంజలి, అదిగో అల్లదిగో తదితర అంశాలను ప్రదర్శించారు.